ఆగని ఇసుక దందా



గన్నవరం ఏటిలో ఇసుక రవాణా చేస్తున్న ట్రాక్టర్లు

- ట్రాక్టర్లు పట్టుకున్నా ఫలితం శూన్యం
- రాజకీయ ఒత్తిళ్లకు తలొగ్గుతున్న అధికారులు
- పట్టుకున్న గంటల వ్యవధిలోనే బయటకు
- గ్రామాల్లో నిల్వ ఉన్న ఇసుక రాసులు

వైరారూరల్: అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఇసుక మాఫియా మీద కన్నెర్ర చేసింది. ఎటువంటి అనుమతులు లేకుండా అక్రమ ఇసుక రవాణా చేసే వారిపై ఉక్కుపాదం మోపి కఠిన చర్యలు తీసుకోవాలని స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది. కానీ వైరా మండలంలో ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా అక్రమ ఇసుక రవాణా యథేచ్ఛగా సాగుతోంది. ఒక వైపు భూగర్భ జలాలు అంతరించి మానువమనుగడ ప్రశ్నార్థకంగా మారుతున్న నేపథ్యాన నీరు, భూమి, చెట్లను పర్యవేక్షించి వాల్టా చట్టాన్ని కాపాడాల్సిన అధికారులు రాజకీయ ఒత్తిళ్లకు తలొగ్గుతున్నారు.

అక్రమ సంపాదనే లక్ష్యంగా..

మండలంలో అధికారిక ఇసుక ర్యాంపులు లేకపోయిన కొంత మంది అధికార, ప్రతిపక్ష పార్టీల నాయకులు అక్రమంగా సంపాదనే లక్ష్యంగా పెట్టుకొని ప్రభుత్వ సంక్షేమ పథకాల పేరుతో పలు గ్రామాల సమీపంలోని వైరా నది నుంచి రాత్రి, పగలు అనే తేడా లేకుండా అక్రమ ఇసుక వ్యాపారం చేస్తున్నారు. గ్రామ పంచాయతీల్లో నిర్మిస్తున్న సీసీ రోడ్లకు సైతం ఈ వైరా నది ఇసుకను వాడాలని హుకుం జారీ చేశారు. ఒక వేళ వేరే ఇసుకను వాడితే కాంట్రాక్టర్‌కు బిల్లులు రాకుండా చేస్తామని బెదిరింపులకు పాల్పడుతున్నారనే ఆరోపణలు బహిరంగంగా వినిపిస్తున్నాయి. దీంతో కాంట్రాక్టర్ మొగ్గు చూపడంతో అధికార పార్టీ నాయకులు హద్దు అదుపు లేకుండా దందా సాగిస్తున్నారు.

గంటల వ్యవధిలో బయటకు..

గత కొన్ని నెలల నుంచి వైరా నది పరివాహక ప్రాంతంలో సమయపాలన లేకుండా ఇసుక దందా జోరుగా సాగుతోంది. దాంతో ఈ నెల 1న 'సాక్షి'లో 'ఇసుకాసురులు'అనే కథనాన్ని ప్రచురితం చేసింది. దాంతో సంబంధిత శాఖ అధికారులు హుటాహుటిన అర్ధరాత్రి వేళ గన్నవరం ఏటిలో దాడులు నిర్వహించగా ఇసుక లోడుతో ఉన్న ఒక ట్రాక్టరతో పాటు మరో నాలుగు ఖాళీ ట్రాక్టర్లను పట్టుకున్నారు. అలా పట్టుకున్న ఇరవైనాలుగు గంటల వ్యవధిలోనే రాజకీయ ఒత్తిలతో అధికారులు ఒక్క ట్రాక్టర్‌పై కేసు నమోదు చేసి మిగిలిన నాలుగింటిని వదిలేశారు. ఇదే అదునుగా భావించిన అక్రమార్కులు గన్నవరం ఏటిలోని వైరా నదిలో ఇసుక రవాణా చేస్తున్నారు. ఇంత జరుగుతున్నా అధికారులు మాత్రం తమకేమి పట్టనట్లు చోద్యం చూస్తున్నారు. దీంతో అధికారులు ఎందుకు మౌనం వహిస్తున్నారనేది ఆ పెరుమాళ్లకే తెలియాలి అని పలువురు అనుకుంటున్నారు.

ఇసుక ర్యాంపులపై పట్టింపులేని రెవెన్యూ శాఖ..

అక్రమ ఇసుక వ్యాపారులు పలు గ్రామాల్లో ఇసుక ర్యాంపుల ఏర్పాటు చేసి ఆ ఇసుకను ఇతరులకు రూ.6,000 వేలకు పైగా విక్రయిస్తుంటట్లు తెలుస్తుంది. ఆ అక్రమ ఇసుకను రెవెన్యూ అధికారులు సీజ్ చేసి వేలం నిర్వహిస్తే ప్రభుత్వానికి కొంచెం ఆదాయమైన సమకూరుతుంది. కానీ అధికారులు తమకేమి పట్టనట్లు వ్యవహరించడం ఇక్కడ చర్చానీయంశమైంది.

రెండు గ్రామాల మధ్య రగడ..

గన్నవరం వైరా నది పరివాహక ప్రాంతాలైన దాచాపురం – గన్నవరం ఇరు గ్రామాలకు మధ్యలో అనుసంధానంగా ఉంది. ఏటిలో ఏర్పడిన ఇసుక దిబ్బలపై ఇరు గ్రామాలకు చెందిన ఇసుకాసురులు మాదంటే మాదే అంటూ వ్యాపారులు నిత్యం వాగ్వాదానికి దిగుతున్నట్లు విశ్వసనీయ సమాచారం. అంతేకాకుండా గన్నవరం ఏటిలో దాచాపురానికి చెందిన ఇసుక తోలేందుకు ట్రాక్టర్లు వస్తే గన్నవరం వ్యాపారులు అడ్డుపడడం, గన్నవరం గ్రామానికి చెందిన వారు ట్రాక్టర్లలో ఇసుకను తోడేందుకు దాచాపురం గ్రామానికి చెందిన వారు అడ్డుపడి గన్నవరం ట్రాక్టర్లకు అడ్డుపడుతున్నట్లు తెలుస్తోంది. ఏదేమైనా ఇసుక రవాణా రగడ తారస్థాయికి చేరి ఇరు గ్రామాలకు చెందిన మూకుమ్మడి దాడులకు పాల్పడకముందే సంబంధిత శాఖ అధికారులు ఇసుక అక్రమ రవాణాపై దృష్టి సారించి ఇసుక రవాణాను అరికట్టేలా చర్యలు తీసుకోవాలని మండల ప్రజలు ముక్త కంఠంతో కోరుతున్నారు.



ఈ నెల 1న 'సాక్షి'లో ప్రచురితమైన కథనం



నిల్వ ఉన్న ఇసుక రాసులు

క్లుప్తంగా

జాతరను పరిశీలించిన ఎమ్మెల్యే



దుకాణాలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే రాందాస్ నాయక్

వైరారూరల్: మండలంతో స్నానాల లక్ష్మీపురం గ్రామంలో శనివారం రాత్రి నిర్వహించిన జాతర వేడుకలను ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్ పర్యవేక్షించారు. జాతరను పురస్కరించుకొని ఆలయ ప్రాంగణంలో నిర్వహించిన సాంస్కృతిక నృత్యాలలో గెలుపొందిన విజేతలకు ఎమ్మెల్యే బహుమతులు అందజేశారు. అనంతరం పలు రకాల దుకాణాలను సందర్శించి సందడి చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, శీలం వెంకటనర్సిరెడ్డి, పుల్లయ్య, అశోక్, మల్లు రామకృష్ణ, స్వర్ణ నరేంద్ర, నూతి బాబు, భువనేశ్వర్, జన్ను, నాగేశ్వరరావు ఉన్నారు.

పోలంపల్లిలో వీరభద్రుడికి పూజలు

కారేపల్లి: పోలంపల్లి గ్రామంలో చిన్న కురవిగా పిలువబడే వీరభద్రస్వామి ఆలయంలో శివ రాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆదివాసీ గిరిజనుల ఆధ్వర్యాన వీరభద్రుడు సమేత భద్రకాళీ అమ్మవారి ఉత్సవాలను గత 30 ఏళ్లుగా నిర్వహిస్తున్నారు. ఆలయ పూజారి మూతి వీరభద్రం ఆధ్వర్యాన దేవుని కల్యాణం నిర్వహించి రథసేవతో ఊరేగింపు నిర్వహించారు. భక్తులు హాజరై స్వామికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు.

'ఉపాధి' కూలి ఇవ్వాలి



మాట్లాడుతున్న దండు ఆదినారాయణ

సత్తుపల్లిటౌన్: ఉపాధిహామీ కూలీలకు పని ప్రదేశాల్లో కనీస సౌకర్యాలు కల్పించాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ దండు ఆదినారాయణ కోరారు. సత్తుపల్లిలో ఆదివారం ఉపాధి కూలీలతో కలిసి ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత రెండు నెలలుగా ఉపాధిహామీలో పని చేసిన కూలీలకు డబ్బులు వెంటనే చెల్లించాలని కోరారు. పని ప్రదేశాల్లో మంచినీళ్లు, టెంట్, ఫస్టెయిడ్, గడ్డపార తదితర సామగ్రిని అందుబాటులో ఉంచాలని కోరారు. సమావేశంలో హలావత్ అలీ, వెంకమ్మ, సునీత, సత్యావతి, రాములమ్మ, వెంకమ్మ, కుమారి, పుష్పావతి, రమణ పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరం

మధిర: మధిర టీవీఎం పాఠశాల ఆవరణలో కార్మిక శాఖ ఆధ్వర్యంలో లేబర్ కార్డు ఉన్న ప్రతి కార్మికుడికి ఆదివారం రక్త పరీక్షలు నిర్వహించారు. మధిర లేబర్ ఆఫీసర్ చంద్రశేఖర్ సమక్షంలో సీఎస్ఈ హెల్త్ కేర్ డీఎం ప్రసాద్, జిల్లా కోఆర్డినేటర్ ప్రవీణ్, మధిర క్యాంపు కోఆర్డినేటర్ రాజ్యలక్ష్మి ఆధ్వర్యంలో ఈ వైద్య శిబిరం నిర్వహించారు. కార్మికులకు తగిన మందులను ఉచితంగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో సిబ్బంది విజయ్, అనిల్, రాజు, జీవమణి, ఇందిర, దివ్య, మధు, రిజ్వానా, మధురవేణి, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

రవికిరణ్‌పాల్‌కు సత్కారం

సత్తుపల్లి: నేషనల్ క్రిస్టియన్ కౌన్సిల్ సత్తుపల్లి మండల అధ్యక్షుడిగా ఎన్నికై న కల్వరి ఎఫ్ఎఫ్ఐ చర్చి పాస్టర్ పి.రవికిరణ్‌పాల్‌ను స్థానిక క్రీస్తు సంఘం ప్రార్థనా మందిరంలో ఆదివారం జరిగిన కార్యక్రమంలో ఘనంగా సత్కరించారు. క్రైస్తవులు ఐక్యంగా ఉండేందుకు కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షుడు అలవాల కరుణాకర్, స్వరూప్‌రాజ్, బి.వరప్రసాద్, దేవసహాయం, శ్యాంసన్, టి.దానియేలు, ప్రసన్నకుమార్, శ్రీను, వేణు తదితరులు పాల్గొన్నారు.

ఆలయ వార్షికోత్సవం

తల్లాడ: స్థానిక హనుమత్ పద్మావతి సమేత వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం 21వ వార్షికోత్సవ వేడుకలు ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ఆలయ ప్రధాన అర్చకులు దివి సీతారామాచార్యుల ఆధ్వర్యంలో విశ్వక్సేన, పుణ్యాహవచనము, అగ్ని ప్రతిష్టాపనము నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు అందించారు.

ఆర్థిక సాయం

కారేపల్లి: బీక్యాతండా గ్రామానికి చెందిన తోట మళ్ల విజయ అనారోగ్యంతో బాధపడుతున్న విషయాన్ని వైరా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్ తెలుసుకున్నారు. వైద్యం నిమిత్తం ఆర్థిక సాయం అందించాలని స్థానిక కాంగ్రెస్ నాయకులను ఆదేశించడంతో ఆదివారం బాధిత మహిళ ఇంటికి వెళ్లి రూ.5 వేలను అందించారు. ఈ కార్యక్రమంలో రైతుబంధు మండల కన్వీనర్ శ్రీను, జగన్, నాగులు, భీముడు, ఓంప్రకాశ్, వినోద్‌కుమార్, గోపాల్, లక్ష్మణ్, రాములు, వినోద్, సుక్యా తదితరుల పాల్గొన్నారు.

బ్రీత్ ఎనలైజర్ టెస్ట్‌లో తప్పడు రిపోర్టు

నిరసనకు దిగిన ఆర్టీసీ డ్రైవర్



నిరసన తెలుపుతున్న ఆర్టీసీ డ్రైవర్

మధిర: టీఎస్ఆర్టీసీ మధిర డిపో వద్ద ఏర్పాటు చేసిన బ్రీత్ ఎనలైజర్ మిషన్‌లో తప్పుడు రిపోర్టులు వస్తున్నాయంటూ ఓ ఆర్టీసీ డ్రైవర్ నిరసనకు దిగిన సంఘటన ఆదివారం మధిర డిపో వద్ద చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే.. ఆర్టీసీ డిపోల వద్ద సంస్థ డ్రైవర్లకు బ్రీత్ ఎనలైజర్ టెస్ట్‌లు నిర్వహిస్తోంది. ఈ క్రమంలో ఆర్టీసీ డ్రైవర్ సంద్ర నాగేశ్వరరావుకి టెస్ట్ చేయగా.. 16 పాయింట్లు చూపించింది. తనకు మద్యం అలవాటు లేకపోయిన విషన్ తప్పుడు రిపోర్టు చూపించడంతో సెక్యూరిటీ సిబ్బంది డ్యూటీకి నిరాకరించారు. దీంతో ఆయన డిపో ముందు ఆందోళనకు దిగాడు. విషయం తెలుసుకున్న కార్మిక సంఘాలు నాగేశ్వరరావుకి మద్దతు పలుకగా.. కాంగ్రెస్ పార్టీ కార్మిక సంఘం ఐఎన్‌టీయూసీ డివిజన్ అధ్యక్షుడు కోరంపల్లి చంటి ఘటనాస్థలానికి వెళ్లి బాధితుల వద్ద వివరాలు సేకరించి డీఎంను ఫోను ద్వారా సంప్రదించగా.. విషయాన్ని ఉన్నతాధికారులకు నివేదిస్తానని చెప్పి చేతులెత్తేశారు. ఈ విషయాన్ని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క దృష్టికి తీసుకెళ్తానని చంటి తెలిపారు. కాగా.. నిరసన తెలుపుతున్న నాగేశ్వరరావును టౌన్ ఎస్సై సంధ్య అదుపులోకి తీసుకున్నారు.

అంతర్జాతీయ ఓపెన్ లైబ్రరీ డైరెక్టర్‌గా ప్రియాచందన్



ప్రియాచందన్

తల్లాడ: సైంటిఫిక్ అంతర్జాతీయ ఓపెన్ లైబ్రరీ బోర్డ్ డైరెక్టర్‌గా తల్లాడ మండలం అన్నారుగూడెం గ్రామానికి చెందిన బీ ఫార్మసీ విద్యార్థిని మారెళ్ల ప్రియాచందన ఎంపికైంది. సైంటిఫిక్ అంతర్జాతీయ ఓపెన్ లైబ్రరీ డైరెక్టర్లుగా భారత్ తరపున విద్యార్థి విభాగం నుంచి ముగ్గురికి అవకాశకం దక్కింది. వీరిలో ప్రియాచందన్ ఒకరు. అంతర్జాతీయంగా వైజ్ఞానికరంగంలోని అన్ని శాఖలలో శాస్త్రీయ విజ్ఞానం, నాణ్యమైన పరిశోధనను పెంపొందించి పాఠకులకు విజ్ఞానాన్ని ప్రచారం చేయాలనే లక్ష్యంతో సైంటిఫిక్ ఓపెన్ లైబ్రరీ కృషి చేస్తుంది. అంతర్జాతీయ ఓపెన్ లైబ్రరీ డైరెక్టర్‌గా ఎంపికై న ప్రియాచందన్‌ను ఆదివారం పలువురు ప్రముఖులు అభినందించారు.

కోతుల సమస్యకు పరిష్కారం



కోతులను అడవికి తోలుతున్న గ్రామస్తులు

కల్లూరురూరల్: మండలంలోని పేరువంచ పంచాయతీలో ఇటీవల కాలంలో వానర సైన్యం విపరీతంగా పెరిగిపోయి గ్రామంలో బీభత్సం సృష్టిస్తున్నాయి. గృహాలలోకి దూరి తినుబండారాలు, అన్నం, కూరగాయలు ఎత్తుకుపోతున్నాయి. పెరటి తోటలను సైతం నాశనం చేస్తున్నాయి. అడ్డువస్తున్న మహిళలను, వృద్ధులను బెదిరిస్తూ దాడికి పాల్పడుతున్నాయి. దీంతో గ్రామస్తులంతా ఏకమై సమస్యకు పరిష్కారం కనుగొనేందుకు సమావేశమై నాలుగు గ్రూపులుగా విడిపోయి గ్రామంలోని కోతులను గ్రామం నుంచి సమీప అడవిలోకి పారత్రోలారు. గతంలో కోతుల సమస్యకు పరిష్కారం కోసం ఎన్నిసార్లు విన్నవించుకున్నప్పటికీ పట్టించుకోక పోవడంతో గ్రామస్తులు ముందుకు వచ్చి తమ సమస్యను పరిష్కరించుకున్నారు.

బీజేపీలోకి జలగం చేరికపై హర్షం

సత్తుపల్లి: మాజీ ఎమ్మెల్యే జలగం వెంకటరావు బీజేపీలో చేరటం పట్ల ఆ పార్టీ ఖమ్మం పార్లమెంట్ కన్వీనర్ నంబూరి రామలింగేశ్వరరావు ఆదివారం ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. గతంలో సత్తుపల్లి, కొత్తగూడెం నియోజకవర్గాలకు ఎమ్మెల్యేగా పనిచేసిన కాలంలో ఆయా నియోజకవర్గాలను అభివృద్ధి చేసిన ఘనత జలగం వెంకటరావుకే దక్కుతుందన్నారు. బీజేపీలో చేరటం ద్వారా పార్టీకి కొత్త ఉత్తేజం నింపారాన్నరు.

క్షమాపణ చెప్పాలి

మధిర: మాజీ మంత్రి హరీష్‌రావు ఉద్యోగులపై చేసిన అనుచిత వ్యాఖ్యలను వెనక్కి తీసుకొని క్షమాపణ చెప్పాలని టీఎస్‌యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి షేక్ నాగూర్ వలి అన్నారు. మధిర యూటీఎఫ్ ప్రాంతీయ కార్యాలయంలో ఆదివారం జరిగిన యూనియన్ ముఖ్య నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రైతులను రెచ్చగొట్టి రైతుల నుంచి ఉద్యోగులను వేరు చేయాలని చూడటం అవివేకమన్నారు. నాయకులు లక్ష్మణరావు, వినోదరావు, వీరయ్య, కస్తూరిబాయి, ఇబ్రహీం, చెన్నయ్య, రాణి, కళావతి, సునీత, లాల్ పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



మధిర: సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

మధిర/ఎర్రుపాలెం/కల్లూరురూరల్: మధిర పట్టణంలోని సీపీఎస్ పాఠశాలలో విద్యనభ్యసించిన 1975–83లో పది చదివిన పూర్వ విద్యార్థులు ఆదివారం దెందుకూరు సమీపంలోని శ్రీరస్తు కల్యాణ మండపంలో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఎర్రుపాలెం మండలంలోని మీనవోలు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1995–96 పూర్వ విద్యార్థులు పాఠశాలలో, అదే విధంగా కల్లూరు మండలంలోని చండ్రుపట్లలో గల జెడ్పీ ఉన్నత పాఠశాలలో 2008–09 సంవత్సరంలో పదో తరగతి పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా ఒకరినొకరు పలకరించుకొని అలనాటి మధుర జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. అదే విధంగా వారి గురువులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు కర్నాటి సుధాకర్‌రెడ్డి, యరమల కిషోర్ రెడ్డి, తలుపుల విజయ్‌బాబు, తలపురెడ్డి వెంకటేశ్వరరెడ్డి, రాఘవాచారి, వెంకటేశ్వరరెడ్డి, అంబడిపూడి శ్రీనివాసరావు, సత్యనారాయణ, సుధాకర్‌రెడ్డి, సత్యనారాయణరెడ్డి, వెంకటేష్, వెంకటరామిరెడ్డి, రామాంజనేయులు, చంద్రశేఖర్‌రెడ్డి, కుటుంబరావు, బాలకృష్ణ, ప్రసాద్, శ్రీనివాసరెడ్డి, రవికుమార్, లక్ష్మి, అరుణకుమారి, హేమలత, కార్తీక, ధనలక్ష్మి, కె.వెంకటేశ్వరరావు, గోపినాథ్, ప్రదీప్, బండి రవి, సందీప్, శివ, కోలా నర్సమ్మ, నందిని, కళావతి పాల్గొన్నారు.

వద్దిరాజును కలిసిన గౌడసంఘం ప్రతినిధులు



ఎంపీ రవిచంద్రకు ఆహ్వానపత్రిక అందజేస్తున్న సంఘం ప్రతినిధులు

ముదిగొండ: మండలపరిధిలోని మాధాపురంలో గౌడసంఘం ఆధ్వర్యంలో నిర్మించిన శ్రీకంఠమహేశ్వరస్వామి ఆలయంలో కంఠమహేశ్వరస్వామి, సూరమాంబ, శివలింగం, నంది, నూతన యంత్రవిగ్రహ ప్రతిష్ఠ మహోత్సవ కార్యక్రమానికి హాజరుకావాలని గౌడసంఘం ప్రతినిధులు ఆదివారం ఖమ్మంలో రాజ్యసభ్యుడు వద్దిరాజు రవిచంద్రకు ఆహ్వానపత్రిక అందజేశారు. ఈ కార్యక్రమాలు ఈ నెల 16నుంచి 21వ తేదీ వరకు నిర్వహిస్తారని తెలిపారు. కార్యక్రమంలో గౌడసంఘం ప్రతినిధులు అంతటి రాములు, తేరాల యాదగిరి,కసగాని యుగంధర్, తేరాల ఉపేందర్, పచ్చిమట్ల రమేష్ లు పాల్గొన్నారు.

విత్తన దుకాణాలకు షోకాజ్ నోటీసులు



నోటీసు ఇస్తున్న ఏఈ నర్సింహారావు

ఏన్కూరు: మండల కేంద్రంలోని విత్తన దుకాణాలను వ్యవసాయాధికారి నర్సింహారావు ఆదివారం తనిఖీ చేశారు. రికార్డులు పరిశీలించిన పిదప బిల్లులు అసంపూర్తిగా రైతులకు ఇచ్చినందుకు షోకాజ్ నోటీసులు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఏఈఓ భాగ్యల హరి పాల్గొన్నారు.

విద్యార్థినులకు సైకిళ్లు పంపిణీ



సైకిళ్లు అందిస్తున్న రోటరీక్లబ్ చేంజ్‌మేకర్స్ సభ్యులు

కల్లూరురూరల్: మండలంలోని చెన్నూరులో రోటరీక్లబ్ చేంజ్‌మేకర్స్ హైదరాబాద్ ఆధ్వర్యంలో ఆదివారం సాయంత్రం విద్యార్థినులకు సైకిళ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా రోటరీక్లబ్ మాజీ అధ్యక్షుడు మాదాల వంశీ అధ్యతన జరిగిన కార్యక్రమంలో రోటరీక్లబ్ చేంజ్ మేకర్స్ హైదరాబాద్ అధ్యక్షుడు కె.వెంకటేష్, ప్రధాన కార్యదర్శి సుమన్‌పైనీ మాట్లాడుతూ.. రోటరీక్లబ్ ద్వారా పేద ప్రజలకు సేవా కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు. భవిష్యత్‌లో చెన్నూరును దత్తత తీసుకొని సేవా కార్యక్రమాలు చేపట్టనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పసుమర్తి మోహన్‌రావు, కేవీఆర్, మాదాల వెంకటేశ్వరరావు, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

క్లాసులకు తప్పనిసరిగా హాజరవ్వాలి



మాట్లాడుతున్న జిల్లా కోఆర్డినేటర్ పాపారావు

ముదిగొండ: ఓపెన్ స్కూల్‌లో విద్యనభ్యసిస్తున్న అభ్యాసకులు తప్పనిసరిగా క్లాసులకు హాజరు కావాలని ఓపెన్ స్కూల్ జిల్లా కోఆర్డినేటర్ మద్దినేని పాపారావు అన్నారు. మండలంలోని చిరుమర్రి జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఓపెన్ స్కూల్ 10వ తరగతి, ఇంటర్ తరగతుల నిర్వహణను ఆదివారం పరిశీలించారు. అభ్యాసకుల హాజరుశాతం, అసైన్‌మెంట్ నోట్స్, రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఓపెన్ స్కూల్‌లో విద్యనభ్యసించిన అభ్యాసకులకు మంచి భవిష్యత్ ఉంటుందన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎస్‌వీకే ప్రసాద్, అసిస్టెంట్ కోఆర్డినేటర్ నాజర్, కౌన్సిలర్లు నవాబు, రమేష్, నిర్మల, కామేశ్వరరావు లు పాల్గొన్నారు.

ఆలయాల్లో ప్రత్యేక పూజలు



సత్తుపల్లి: బుగ్గపాడు శివాలయంలో పూజలు చేస్తున్న మల్లు నందిని, ఎమ్మెల్యే రాగమయి

సత్తుపల్లి/మధిర: డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్క సతీమణి మల్లు నందిని, సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి ఆదివారం సత్తుపల్లి మండలం బుగ్గపాడు శివాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. అదే విధంగా మధిరలోని మృత్యుంజయ స్వామిని మల్లు నందిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు పలువురిని అలరించాయి. మాటూరుపేట శ్రీ సీతారామాంజనేయ కళాపరిషత్ అధ్యక్షుడు గడ్డం సుబ్బారావు ఆధ్వర్యంలో శ్రీకృష్ణాంజనేయ యుద్ధం నాటక ప్రదర్శన జరిగింది. కార్యక్రమాన్ని సీనియర్ కళాకారుడు టీవీ రెడ్డి ప్రారంభించారు. కార్యక్రమంలో ఆలయ నిర్వాహకులు వెల్లటూరి ప్రసాదాచార్యులు, తుమ్మూరు శ్రీరాంప్రసాద్, బొడ్డు శివ, కాంగ్రెస్ నాయకులు కిషోర్, సత్యంబాబు, హనుమంతరావు, టీవీ రెడ్డి, శ్రీనివాసరావు, రామకృష్ణ, నవీన్ రెడ్డి, బాలరాజు, సందీప్, సుచరిత, వనజ, రంగస్థల కళాకారుల సమాఖ్య అధ్యక్షుడు పుతుంబాక శ్రీకృష్ణప్రసాద్, బాబ్లా, జంగాల గురువులు తదితరులు పాల్గొన్నారు.

ఉన్నత లక్ష్యాలను సాధించండి

సత్తుపల్లిటౌన్: విద్యార్థులు ఇష్టమైన రంగాన్ని ఎంచుకొని ఉన్నత లక్ష్యాలను సాధించాలని సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి, డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్క సతీమణి మల్లు నందిని అన్నారు. సత్తుపల్లిలోని చైతన్య టెక్నోస్కూల్ వార్షికోత్సవంలో పాల్గొని ప్రతిభ చూపిన విద్యార్థులను, తల్లిదండ్రులను సత్కరించారు. అదే విధంగా జ్యోతి నిలయం పాఠశాలలో ఆర్‌సీఎం చర్చి ఆధ్వర్యాన ఆదివారం నిర్వహించిన మెగా రక్తదాన శిబిరం, ఉచిత వైద్యశిబిరాన్ని ఎమ్మెల్యే రాగమయి ప్రారంభించి మాట్లాడారు. రక్తదానంతో ప్రాణాపాయ స్థితిలో ఉన్న అనేక మంది ప్రాణాలను కాపాడవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు నారాయణవరపు శ్రీనివాస్, ప్రిన్సిపాల్ వై.మురళీకృష్ణ, డైరెక్టర్లు ఏసుబాబు, రవికుమార్, రాకేష్, సుజాత, రాధా, ఉష, అమృత్‌రాజ్, బి.వెంకట్, విన్సెంట్ పాల్గొన్నారు.

బనిగండ్లపాడులో పొట్టేళ్ల పోటీలు



పోటీలను నిర్వహిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

ఎర్రుపాలెం: మండలంలోని బనిగండ్లపాడు గ్రామంలో మహా శివరాత్రి సందర్భంగా శ్రీదుర్గామల్లేశ్వర స్వామి ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం రెండు జిల్లాల స్థాయి (ఖమ్మం,ఎన్టీఆర్ జిల్లాలు) గొర్రె పొట్టేళ్ల పోటీలు నిర్వహించారు. ఈ పోటీలను ఆలయ కమిటీ చైర్మన్ యన్నం పిచ్చిరెడ్డి, ప్రధాన కార్యదర్శి పెద్దమళ్ల మోహన్‌రావు, సొసైటీ చైర్మన్ శీలం అక్కిరెడ్డి, మాజీ సర్పంచ్ జంగా పుల్లారెడ్డి, దాతలు ప్రారంభించారు. ఈ పోటీల్లో 20 గొర్రె పొట్టేళ్ల టీమ్‌లు పాల్గొన్నాయి. పోటీల్లో ప్రథమ, ద్వితీయ బహుమతులను ఎర్రుపాలెం మండలం రాజులదేవరపాడుకు చెందిన కోమటి ఆజేష్ రాజు, ఏపీ రాష్ట్రం ఎన్టీఆర్ జిల్లా తొర్లపాడుకు చెందిన పెరుగు నర్సింహారావులు గెలుచుకోగా తృతీయ బహుమతిని ఏపూరి పుల్లారావు(తొర్లపాడు), చతుర్ధ బహుమతిని ఏపీ రాష్ట్రం వేదాద్రికి చెందిన గుడారి నరేష్ సాధించారు. కార్యక్రమంలో అర్చకులు నర్సింహామూర్తి, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

పెండింగ్ బిల్లులు చెల్లించాలి



మధ్యాహ్న భోజన కార్మికులతో రామకృష్ణ

సత్తుపల్లిరూరల్: మధ్యాహ్న భోజన కార్మికులకు పెండింగ్ బిల్లులు తక్షణమే చెల్లించాలని తెలంగాణ రాష్ట్ర మధ్యాహ్న భోజన పథకం వర్కర్స్ యూనియన్ రాష్ట్ర నాయకుడు నిమ్మటూరి రామకృష్ణ డిమాండ్ చేశారు. సత్తుపల్లిలోని విశ్వశాంతి స్కూల్‌లో ఆదివారం తెలంగాణ రాష్ట్ర మధ్యాహ్న భోజన పథకం వర్కర్స్ నియోజకవర్గ స్థాయి ముఖ్య కార్యకర్తల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ.. గత ప్రభుత్వంలో ఐదు నెలలుగా కోడిగుడ్డు బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయని, రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చే 9,10వ తరగతుల మెనూ ఛార్జీలు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. ప్రభుత్వం బిల్లులను చెల్లించి మధ్యాహ్న కార్మికులను ఆదుకోవాలని కోరారు. రాష్ట్రంలో కాంగ్రెస్ వచ్చాక ఉద్యోగులకు 1వ తేదీనే వేతనాలు అందుతున్నాయన్నారు. అలాగే గత ప్రభుత్వ హయాంలో ఉన్న పెండింగ్ బిల్లులు కూడా అందించాలన్నారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ మండల కార్యదర్శి రామారావు, మండల అధ్యక్షుడు బసవయ్య, మధ్యాహ్న భోజన నాయకురాలు మహదేవలక్ష్మి, వెంకమ్మ, రహీమున్నీసా, వెంకటలక్ష్మి, జయమ్మ, పి.సత్యవతి, వెంకటమ్మ, రాఘవమ్మ, భారతి, రాజ్యలక్ష్మి, విజయలక్ష్మి, కృష్ణవేణి, కనకదుర్గ, సీతమ్మ పాల్గొన్నారు.

అమరుల ఆశయాలను సాధించాలి

చింతకాని: అమరవీరుల ఆశయాలను సాధించే దిశగా కార్యకర్తలు ముందుకు సాగాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు జమ్ముల జితేందర్‌రెడ్డి పేర్కొన్నారు. మండల పరిధిలోని నాగిలిగొండ గ్రామంలో సీపీఐ సీనియర్ నాయకుడు నారాయణ వర్ధంతి సభను పార్టీ గ్రామకమిటీ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజా సమస్యలపై పోరాటాలు నిర్వహించటమే అమరులకు మనమిచ్చే నివాళి అని సూచించారు. నారాయణ స్మారక స్తూపం వద్ద ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు రవీంద్రబాబు, మండల కార్యదర్శి మల్లిఖార్జున్‌రావు, మండల నాయకులు వెంకటనర్సయ్య, విజయ్, చినజాన్, రమేష్‌బాబు, మురార్జి, శ్రీను, శేఖర్, నాగేశ్వరరావు, ఫిలిప్, గ్రామ మాజీసర్పంచ్ సురేష్ పాల్గొన్నారు.

రైతులకు నష్ట పరిహారం చెల్లించాలి

ఏన్కూరు: నకిలీ విత్తనాలు, ఎరువులు, పురుగుల మందులు అమ్ముతూ రైతులను మోసం చేస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని సీపీఐ మండల కార్యదర్శి జాగర్లమూడి రంజిత్‌కుమార్ అధికారులను డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో ఆదివారం నిర్వహించిన సీపీఐ ముఖ్యకార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. పంటనష్టపోయిన రైతులకు పరిహారం చెల్లించాలన్నారు. కార్యక్రమంలో సీపీఐ మండల నాయకులు తెప్పల సత్యం, అమరనేని వీరభద్రం, మేడ భూషయ్య, మంకెన కృష్ణ పాల్గొన్నారు.

పేదల జీవితాల్లో కాంగ్రెస్ వెలుగులు



జీరో బిల్లులు చూపిస్తున్న లబ్ధిదారులు

మధిరరూరల్: కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వంలో పేదల జీవితాల్లో వెలుగులు నిండాయని మండల కాంగ్రెస్ ఎస్సీ సెల్ అధ్యక్షుడు దారా బాలరాజు అన్నారు. ఆదివారం మండలంలోని ఆత్కూరు గ్రామంలో అర్హులైన విద్యుత్ వినియోగదారులకు జీరో కరెంట్ బిల్లులు అందించడం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ ఇప్పటికే ఆరు గ్యారంటీలను అమలు చేసిందని.. మిగతా రెండింటిని కూడా త్వరలోనే అమలు చేస్తుందన్నారు. త్వరలో జరగబోయే పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు ఓటువేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు సత్యానందం, నాగయ్య, లాజరు, రవికుమార్, కిషోర్, లింగయ్య, లక్ష్మయ్య, బుల్లయ్య, జానకమ్మ, సుగుణ, కృపామణి తదితరులు పాల్గొన్నారు.

జీరో కరెంట్ బిల్లుల పంపిణీ..

వైరారూరల్: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న ఆరు గ్యారంటీలలో భాగంగా మండలంలోని తాటిపూడి గ్రామంలో ఆదివారం జీరో కరెంట్ బిల్లును ప్రారంభించారు. కాంగ్రెస్ యువజన విభాగం మండల నాయకుడు జవ్వాజి నాగరాజు వినియోగదారులకు జీరో బిల్లులను పంపిణీ చేశారు. వెంకటేశ్వర్లు, సత్యం, సైదులు, కృష్ణ, సంగమేశ్వరరావు, అంజనేయరావు, రుక్మిణి తదితరులు పాల్గొన్నారు.